ప్రజాశక్తి

శుక్రవారం 31 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

దక్షిణం వైసిపిలో మళ్లీ కుంపటి

- ఎమ్మెల్యే గణేష్ కుమార్‌కు విపత్కర పరిస్థితి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్, గురువులు ఓటమితో కొత్త తలనొప్పి


ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసిపి పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. వచ్చే ఎన్నికల్లో గ్రూపుల పోరు తప్పేలా లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరిస్థితి వెంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుగా తయారైంది. ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీగా అధికార వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన సీతంరాజు సుధాకర్, ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోలా గురువులు పరాజయం పాలవడంతో ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లికి కొత్త తలనొప్పి వచ్చిపడింది.


బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేసిన సుధాకర్, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేసిన గురువులు ఈ నియోజకవర్గం నుంచే టిక్కెట్ ఆశిస్తూ వస్తున్నారు. వారిని మండలికి పంపి వాసుపల్లికి మళ్లీ టిక్కెట్ ఇవ్వాలని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి భావించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వారిని బరిలోకి దింపారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, క్రాస్ ఓటింగ్‌తో తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్, గురువులు పరాజయం పొందారు. వీరు విజయం సాధించి ఉంటే దక్షిణ నియోజక వర్గంలో 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్ కుమార్ పోటీ చేయడం నిజమయ్యేది. దానికి భిన్నంగా జరగడంతో గణేష్ కుమార్‌కు ఆ పార్టీ టికెట్ దక్కుతుందా లేదా అనేది చెప్పడం కష్టంగా మారింది. ఎందుకంటే కొద్దికాలంగా సీతంరాజు సుధాకర్ నియోజ కవర్గంలో చురుగ్గా కార్యక్రమాలు చేపడుతూ వైసిపి అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నారు. అందుకోసం భారీగానే డబ్బు ఖర్చు చేశారు. గతంలో కరోనా వంటి విపత్కర పరిస్థితిలో దక్షిణ నియోజకవర్గంలో పేదలందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. కొంతమందికి ఆర్థిక సాయం అందించారు. గర్భిణులకు సామూహిక సీమంత కార్యక్రమాలు చేపట్టారు. నియోజవర్గంలోని పలుచోట్ల ఉచితంగా వాల్ క్లాక్స్ పంపిణీ చేశారు. యువతను ప్రోత్సహించడంలో భాగంగా క్రీడల పోటీలు నిర్వహించడం, క్రీడా సామగ్రిని ఉచితంగా



వాసుపల్లి గణేష్ కుమార్



కోలా గురువులు



సీతంరాజు సుధాకర్

మిగతా 2లో..



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న విదేశీ ప్రతినిధి

జి 20లో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్

వార్త మెయిన్‌లో..

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉపాధి కూలీలకు పనిచేసేచోట తాగునీరు ఏర్పాటుచేసి, పనిముట్లు పంపిణీచేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. పని ప్రాంతంలో దెబ్బతగిలితే ప్రాథమిక చికిత్స చేసేందుకు కిట్స్ కూడా అందుబాటులో ఉంచడంలేదని, ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు పరదాలు కూడలేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. రెండు పూటలా పనిచేసినా కూలి గిట్టడంలేదని తెలిపారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు

మిగతా 2లో..

నేడు, రేపు మంత్రి నాగార్జున పర్యటన

వార్త 8లో..

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

వార్త 4లో..

జి-20 పేరుతో ప్రజా ధనం వృథా

వార్త 3లో..

స్టీల్‌ప్లాంట్ రక్షణకు..

1న మానవహారాన్ని జయప్రదం చేయండి

అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ జగ్గునాయుడు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఏప్రిల్ 1వ తేదీన అన్ని కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన చేపట్టే మానవహారాన్ని జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100 శాతం అమ్మాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ ప్రజాద్రోహ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన జరుగుతోందని తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరం ఏప్రిల్ 1వ తేదీకి రెండేళ్లు పూర్తి చేసుకుంటుందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశం, ప్రజల ప్రయోజనాల కన్నా తన అనుకూల కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరగకుండా దెబ్బతీస్తోందని తెలిపారు. ముడి ఇనుము, బొగ్గు సరఫరా కానివ్వడం లేదని, రైల్వే రేక్స్‌పై ఆంక్షలు విధిస్తోందని, సంస్థకు వర్కింగ్ కేపిటల్ ఇవ్వడంలేదని వివరించారు. ప్లాంటును ఖాయిలా పరిశ్రమగా మార్చే ప్రయత్నంలో ఉందని విమర్శించారు. ప్రభుత్వ బ్యాంకులలోని ప్రజల సొమ్ము రూ.6.31 లక్షల కోట్లు మాఫీ చేసి కార్పొరేట్లకు సేవ చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు రూ.20 వేల కోట్లు మాఫీ చేయడానికి చేతులు రావడం లేదని పేర్కొన్నారు. ప్లాంటు నుంచి రూ.50 వేల కోట్లు ఆదాయం పొందిన కేంద్ర ప్రభుత్వం, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం లేదని తెలిపారు. సంస్థను ఆర్థికంగా దెబ్బతీసి, పరిశ్రమను, కోట్ల విలువైన వేలాది ఎకరాల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే

మిగతా 2లో..

విభిన్న ప్రతిభావంతుల

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు

నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వివిధ ప్రభుత్వ శాఖలలో విభిన్న ప్రతిభావంతులకు కేటాయించిన 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయుటకు ఉమ్మడి విశాఖపట్నం వికలాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ విశాఖ జిల్లా కలెక్టర్ గురువారం ప్రకటన విడుదల చేశారు. అంధులకు 9, బధిరులకు 8, శారీరక వైకల్యం 7 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. కనీస అర్హతలు, పోస్టుల వివరాలు, నోటిఫికేషన్, సూచనలు, దరఖాస్తుకు https://visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. దరఖాస్తులను సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రాణీ చంద్రమణీదేవి ఆసుపత్రి ప్రాంగణం, పెద వాల్తేర్ జంక్షన్, విశాఖపట్నం-530017 చిరునామాకు ఏప్రిల్ 13లోగా అందజేయాలని పేర్కొన్నారు.



విశాఖ నగరంలో జరిగిన వేడుకల్లో ప్రముఖులు

ఘనంగా శ్రీరామనవమి

వార్త 7లో..

మొదటి పేజీ తరువాయి..

దక్షిణం వైసిపిలో మళ్లీ కుంపటి

పంపిణీ చేయడం వంటి పనులు చేపట్టారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించి కొందరు వైసిపి కార్పొరేటర్లు సుధాకర్ ముఖ్య అనుచరులుగా మారారు. వీరిలో కొందరు వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఆయనను అడ్డుకుని అక్కసు ప్రదర్శించారు. సుధాకర్ ఎమ్మెల్సీ పదవి పొందలేని కారణంగా తిరిగి దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే తన అనుచరులతో సమావేశాలు నిర్వహించారు. మరోవైపు రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డికి ముఖ్య అనుచరునిగా సుధాకర్ ఉన్నారు. తిరిగి ఆయన ఆశీస్సులతోనే, ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో సుధాకర్ ఉంటారని పలువురు భావిస్తున్నారు.

గురువుల పరిస్థితి ఇలా..

మరోపక్క కోలా గురువులు చాలా కాలంగా రాజకీయాల్లో ఉంటున్నా ఆయనకు నిరాశే ఎదురవుతోంది. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ అధ్యక్షునిగా ఉన్న ఆయన్ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి అధిష్టానం ప్రకటించిన సందర్భంలో గెలుపు తథ్యమని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఫలితం రావడంతో ఆయన ఓటమి చెందారు. శాసనసభలో ఉన్న బలాబలాలను బట్టి ఎన్నికలు జరిగిన మొత్తం 7 స్థానాల్లో వైసిపి అభ్యర్థులు విజయం సాధించాల్సి ఉంది. అయితే ఈ నెల 23న వైసిపిలో క్రాస్ ఓటింగ్ జరగడంతో ఆ పార్టీ తరపున పోటీలో ఉన్న ఏడుగురిలో ఆరుగురు విజయం సాధించగా కోలా గురువులు ఓటమి చెందారు. దీంతో దక్షిణ నియోజకవర్గంలో ఆయన అనుచరులు, ముఖ్యంగా మత్స్యకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అందినట్టే అంది ఎమ్మెల్సీ పదవి చేజారడం పట్ల వారు తీవ్రంగా బాధపడ్డారు. వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉంటూ, విధేయునిగా గురువులు గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈసారి ఆయనకే ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వాలని ఆయన అభిమానులు సైతం కోరుతున్నారు. గణేష్ కుమార్ టిడిపి తరపున ఎమ్మెల్యేగా నెగ్గి తర్వాత ఆ పార్టీకి దూరమై వైసిపికి చేరువయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకంటే తొలి నుంచీ పార్టీని నమ్ముకున్న గురువులు, సుధాకర్‌కు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వాలన్న వాదనా లేకపోలేదు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎనిమిదేళ్ళుగా ప్రతి సంవత్సరం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లను తగ్గించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంతో కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఉపాధి పథకాన్ని రక్షించుకునేందుకు, సౌకర్యాలు, మెరుగైన వేతనాలు సాధించేందుకు కూలీలు ఐక్యంగా పోరాడేందుకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

1న మానవహారాన్ని జయప్రదం చేయండి

పన్నాగంలో కేంద్రం ఉందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ఆందోళనను ఉధృతం చేయాలని జెఎసి నిర్ణయించిందని తెలిపారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 1న ఉదయం 10 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి గురజాడ విగ్రహం వరకు ప్రదర్శన, అనంతరం మానవహారం ఉంటాయని పేర్కొన్నారు. కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

టాటా ఏస్‌ను ఢీకొన్న 'దురంతో'

విశాఖపట్నం, విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలు ఆలస్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఏలూరు జిల్లా భీమడోలు వద్ద టాటా ఏస్ వాహనాన్ని దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దురంతో రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో రైలు ఇంజన్ భాగం దెబ్బ తినటంతో 5 గంటలకు పైగా నిలిచిపోయింది. గురువారం ఉదయం దురంతో ఎక్స్‌ప్రెస్ వస్తుండటంతో భీమడోలు జంక్షన్ వద్ద రైల్వే గేటును సిబ్బంది వేశారు. అదే సమయంలో టాటా ఏస్ వాహనంలో వచ్చిన కొంతమంది రైల్వే గేటును ఢీకొట్టి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ వాహనం రైల్వే ట్రాక్‌పైకి వచ్చింది. అదే సమయంలో దురంతో ఎక్స్‌ప్రెస్ సమీపించడంతో సదరు వ్యక్తులు బొలెరో వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. రైలు ఢీకొనడంతో ఆ వాహనం ధ్వంసమైంది. రైలు ఇంజిన్ దెబ్బతినడంతో మరో ఇంజిన్ అమర్చేందుకు రైల్వే సిబ్బంది ప్రయత్నాలు చేశారు. దురంతో ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులు కొందరు ప్రత్యామ్నాయ మార్గాల్లో బయల్దేరి వెళ్లారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. టాటా ఏస్ వాహనంలో వచ్చినవాళ్లు దొంగలా? పారిపోయే క్రమంలో గేటును ఢీకొట్టారా? లేదా మరేదైనా కారణమా? అనే కోణంలో రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

జి-20 సదస్సు విజయవంతం : సిపి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో నిర్వహించిన జి-20 అంతర్జాతీయ సదస్సును అన్ని శాఖల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతముగా నిర్వహించినట్లు నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జి-20 సదస్సు వేదిక పరిసర ప్రాంతాలు, విదేశీ ప్రతినిధులు బస చేసిన హోటళ్ళను, నగరంలో ప్రతినిధులు సందర్శించిన కాపులుప్పాడ ఎనర్జీ ప్లాంట్, ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్, మాధవధారలోని వాటర్ సస్టైనబుల్ ప్రాజెక్టుల వద్ద పూర్తి బందో బస్తు ఏర్పాట్లుచేసి ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా ముగిసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.



పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : శిష్టకరణం యువత ఫౌండేషన్ ద్వారా 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు రైటింగ్ ప్లాంక్, రెండు పెన్నులు, రెండు పెన్సిళ్లు, ఒక ఎరేజర్, ఒక షార్పనర్, ఒక పౌచ్‌ను అందించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిష్టకరణం యువత ఫౌండేషన్ పేరుతో మూడేళ్లుగా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దబ్బీరు శ్రీకాంత్, సంస్థ అధ్యక్షులు ఎం.సురేష్ కుమార్, యువత కార్యదర్శి మరడం రవికుమార్, ఎంఎస్ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇ - వెహికల్స్ పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎంఎస్ఎఫ్-3లోని ఈ వెహికల్స్‌ను సౌత్ ఈస్ట్ ఆసియా ఎడిబి డైరెక్టర్ పరిశీలించారు. గురువారం ఆయన జి-20 సదస్సుకు హాజరైన సందర్భంగా పెదవాల్తేరు శాంతి ఆశ్రమం వద్ద ఉన్న ఎంఎస్ఎఫ్-3 లోని ఇ - వెహికల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇ - వెహికల్స్ ద్వారా ఇందనం పొదుపుతోపాటు పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదని తెలిపారు.

అల్టిగ్రీన్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాణిజ్య విద్యుత్ వాహన తయారీదారు అల్టిగ్రీన్ తమ సరికొత్త ఎక్స్‌పీరియన్స్ కేంద్రాన్ని అక్కిరెడ్డిపాలెంలో ప్రారంభించింది. దీని ద్వారా నగరంలోని ఈవీ ప్రియులకు అల్టిగ్రీన్ యొక్క విస్తృత శ్రేణి కార్గో వాహనాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం అందిస్తుంది. విశాఖలో లక్ష్మి గ్రూప్‌తో భాగస్వామ్యం చేసుకుంది. ఈ నూతన షో రూమ్‌ను అల్టిగ్రీన్ రిటైల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సంస్థ నేషన్ హెడ్ ప్రశాంత్ శంకేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేడ్ ఇన్ ఇండియా కంపెనీగా పెరుగుతున్న వినియోగదారుల అవసరాలను తీర్చనుండటం పట్ల చాలా సంతోషంగా ఉన్నామన్నారు. లక్ష్మి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఎర్రబల్లి మాట్లాడుతూ, "అల్టిగ్రీన్‌తో భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నంలో ఈవీ విప్లవం తీసుకురానున్నామని చెప్పారు.



అల్టిగ్రీన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

18వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 18వ వార్డు పరిధి అంజయ్యనగర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైసిపి ఇన్‌ఛార్జి పుర్నేళ్ల ధనలక్ష్మీశంకర్, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామ్ నో వరుణ కారు ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సామ్ నో వరుణ కారు ర్యాలీ యొక్క విశాఖపట్నం -తిరునెల్వేలి లెగ్ (లెగ్ 2)ను గురువారం తూర్పు నౌకాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మ్ సంజయ్ వాత్సయన్ విశాఖలో ఫ్లాగ్ ఆఫ్ చేశారు. అధికారులు, నావికులతో పాటు 36 మంది ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు తీర ప్రాంతాలలో 1770 కిలోమీటర్ల దూరం వరకు సాగే ఈ యాత్రలో పాల్గొంటున్నారు.



కారు ర్యాలీని ప్రారంభిస్తున్న నేవీ ప్రతినిధులు

పిఎసి సభ్యులతో డిఆర్ఎం భేటీ



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ : ప్యాసింజర్ ఎమినిటీస్ కమిటీ (పిఎసి) సభ్యులతో వాల్తేరు డిఆర్ఎం అనుప్‌కుమార్ సత్పతి గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలకు సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించారు. ప్యాసింజర్ ఎమినిటీస్ కమిటీ సభ్యులు దిలీప్ కుమార్ మల్లిక్, అభిజిత్ దాస్, నిర్మలా కిషోర్ బొల్లిన, గొట్టాల ఉమారాణి, డాక్టర్ జివి మంజునాథ్, పరశురామ్ మహ్హొల బృందం డివిజన్‌లోని సింహాచలం, కొత్తవలస, బొర్రాగుహలు, శిమిలిగూడ, అరకు తదితర ప్రాంతాల్లో ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫాం షెల్టర్లు, ఫుట్ ఓవర్లు, ప్రయాణికుల సిట్టింగ్ ఏర్పాట్లు, క్యాటరింగ్ స్టాళ్లు, పరిశుభ్రత తదితర అంశాలను ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు పరిశీలించారు. గోరాపూర్, మచ్చుకుంద రోడ్, దార్లిపుట్, దమంజోడి, కోరాపుట్, విశాఖపట్నం స్టేషన్లను తనిఖీ చేశారు.

ప్రణాళికతో ముందుకు...



- 'పది'లో వంద శాతానికి చేరేందుకు..
- ప్రతిభ ఆధారంగా గ్రూపులుగా విభజన
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఒక్కో టీచర్‌కు ఆరుగురేసి దత్తత
- ఉత్తమ మార్కులు, ఫలితాలు సాధనే లక్ష్యం
- తోటగరువులో ఉపాధ్యాయుల తర్ఫీదు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉమ్మడి విశాఖ జిల్లాలలో రెండవ అత్యధిక పదో తరగతి విద్యార్థులు కలిగిన ఆరిలోవ, తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదిలో మెరుగైన ఫలితాలు సాధనకు కృషి జరుగుతోంది. ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికతో ఉపాధ్యాయులు తర్ఫీదునిస్తుంటే, తదనుగుణంగా విద్యార్థులు రేయింబవళ్లు శ్రమించి చదువుతున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి తర్ఫీదునిస్తున్నారు. గతేడాది కరోనా, పరీక్ష విధానం మార్పు, ఇతరత్రా కారణాలతో ఉత్తీర్ణత శాతం తగ్గిన నేపథ్యంలో, ఈ ఏడాది శతశాతం ఫలితాలు, అదీ ఉత్తమమైన మార్కులతో సాధించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు.

గ్రూపులుగా విభజన...

తోటగరువు ప్రభుత్వ పాఠశాలలో 358 మంది పదోతరగతి విద్యార్థులుంటే, వీరిలో 216 మంది ఇంగ్లీష్, 142 మంది తెలుగు మీడియం విద్యార్థులు. బాలురు 227 మంది కాగా, 161 మంది బాలికలు. తరగతి గదిలో వారి ప్రతిభ ఆధారంగా ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించారు. చదువుపై మంచి పట్టున్న విద్యార్థులు ఎ,బి గ్రూపుల్లో ఉంటే, కాస్త వెనుకబడిన పిల్లలున్న సి, డి గ్రూపుల్లో ఆరుగురేసి విద్యార్థులను ఒక్కో టీచర్ అప్పగించారు. ఆయా గ్రూపుల్లో విద్యార్థులు ఎలా చదువుతున్నారు? వారి పురోగతి, ఇతర సమస్యలు, సందేహాలుంటే సంబంధిత సబ్జెక్టు టీచర్‌ద్వారా నివృతి చేసి, వారు సైతం మంచి మార్కులతో పాసయ్యేలా ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. ఇక ఎ,బి గ్రేడుల్లో ఉన్నవారికి వందశాతం మార్కులు సాధించే సిద్ధం చేస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుతో వారిని మేలుకొల్పడం..

సి, డి గ్రూపుల్లో ఉన్న విద్యార్థులకు ఒక వాట్సాప్ గ్రూపు సృష్టించారు. ఎప్పటికప్పుడు వారి ప్రగతి ఈ గ్రూపు ద్వారా తెలుసుకుంటున్నారు. ఉదయం 4.45 గంటలకే నిద్రలేచేలా విద్యార్థుల తల్లిదండ్రులకు బాధ్యత అప్పగించారు. వారు నిద్రలేచారో లేదో ఉపాధ్యాయులు ఫోన్లు చేసి ఆరా తీసేవిధంగా ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించారు.

బడి వేళలకు అదనంగా ప్రత్యేక తరగతులు..

బడి వేళలకు అదనంగా ఉదయం 8.30 నుంచి 9.45 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యార్థులకు అదనపు తరగతులు, స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నారు. వంద రోజుల ప్రణాళిక ఆధారంగా పునశ్చరణ, మాక్ టెస్ట్‌లు నిర్వహణ ద్వారా వారిని పరీక్షలకు సన్నద్ధులను చేయడంతోపాటు పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టేలా కృషి జరుగుతోంది,.

వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయం



కారణమేదైనా, గతేడాది నిరాశాజనక ఫలితాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన ఫలితాల సాధనకు నిర్ధిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం.ఒక్కో టీచర్‌కు ఆరుగురు విద్యార్థులను దత్తతనిచ్చి, పరీక్షలకు వారిని సన్నద్ధులను చేయిస్తున్నాం. శతశాతం ఉత్తీర్ణతతోపాటు ఎక్కువ మంది విద్యార్థులు 580పైబడి మార్కులు సాధనే లక్ష్యం.

- జి.కె.దుర్గాభవాని, ప్రధానోపాధ్యాయురాలు

ఉదయమే ఫోన్ చేస్తారు..



తెల్లవారు జామున నిద్ర లేచి చదువుతున్నామో లేదో ఉపాధ్యాయుడు ఫోన్ చేసి మా తల్లిదండ్రులను ప్రతిరోజూ అడుగుతుంటారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ప్రగతిని పర్యవేక్షిస్తున్నారు. ఈ పద్ధతి చాలా ఉపయోగపడుతోంది

- ఆర్.మధు,
పదోతరగతి, ఆంగ్లమాధ్యమం

పరీక్షలంటే భయం పోయింది..



మా ప్రతిభ అంచనాకు ప్రతిరోజూ నిర్వహించే మాక్ టెస్ట్‌లతో ఇపుడు పరీక్షలంటే భయం పోయింది. సందేహాలుంటే నివృతికి సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో ఉండడంతో బాగా చదువుతున్నాం. 580 పైబడి మార్కులు సాధనకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నాను

- టి.షాలిని, పది విద్యార్థిని,
ఇంగ్లీషు మీడియం

580 మార్కుల సాధన లక్ష్యం



ఉపాధ్యాయులు సూచించిన విధంగా ఒక ప్రణాళిక బద్ధంగా చదువుతున్నాను పదోతరగతిలో 580 మార్కులు సాధనకు కృషి చేస్తున్నారు. తప్పకుండా సాధిస్తానన్న నమ్మకం ఉంది.

- శ్రీలేఖ,
పది విద్యార్థిని,
తెలుగు మీడియం

సభ్యులకు మెరుగైన సేవలో 'త్రిఫ్ట్' సొసైటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఆవిర్భావం నుంచి గడచిన 36ఏళ్లుగా 14,065 సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తూ, రూ.387కోట్ల వార్షిక టర్నోవర్‌తో, ఏటా ఆడిట్ వర్గీకరణలో 'ఏ' గ్రేడ్ సొసైటీగా స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ దూసుకుపోతోందని సొసైటీ ఉపాధ్యక్షుడు కె. ఆనందకుమార్ అన్నారు. స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన 57వ మహాజన సభకు అధ్యక్షతన వహించిన ఆయన మాట్లాడుతూ, సభ్యుల డిపాజిట్స్ త్రిఫ్ట్ ఫండ్, రిటైర్‌మెంట్ ఫండ్స్‌పై 80శాతం మొత్తాన్ని సెక్యూరిటీ లోన్‌గా ఇవ్వడానికి, అలాగే ,సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్‌గా ప్రస్తుతం సంవత్సరానికి చెల్లిస్తున్న రూ.750లను రూ.850లుగా పెంచి చెల్లించేందుకు పాలకవర్గం చేసిన ప్రతిపాదనలకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి వార్షిక నివేదికను, కోశాధికారి డివివిఎస్ఎస్ కొండరాజు 2023-24 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా. మహాజన సభ ఆమోదం తెలిపింది డైరక్టర్ ఎమ్‌వి.రమణ బైలా సవరణలను ప్రతిపాదించారు. అంతకుముందు మరణించిన సభ్యులకు డైరెక్టర్ లాలూ భూక్యా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డైరక్టర్ కర్రి శ్రీనివాస్ వందన సమర్పణతో మహాజన సభ ముగిసింది. కార్యక్రమంలో డైరక్టర్లు జివి.రమేష్, విజి.మహీధర్, వివిధ కార్మిక సంఘ నాయకులు, మాజీ పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, సీనియర్ మేనేజర్ కె.దామోదరరెడ్డి, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



57వ మహాజన సభలో పాల్గొన్న త్రిఫ్ట్ ప్రతినిధులు

ఇంజినీరింగ్ యానిమేషన్ వీడియోల తయారీకి
స్మార్ట్‌జెన్‌తో గీతం ఎంఒయు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న గీతం, స్మార్ట్‌జెన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : యానిమేషన్ సాయంతో ఇంజినీరింగ్ విద్యాబోధన ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే అవకాశంఉందని గీతం రిజిస్ట్రార్ ఆచార్య డి.గుణశేఖరన్ అన్నారు. ఈ సరికొత్త విధానంలో అవసరమైన యానిమేషన్ వీడియోల తయారీకి స్మార్ట్‌జెన్ సంస్థతో గీతం డీమ్డ్ వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్మార్ట్ జెన్ సిఇఒ నవీన్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ ఆలోచన విజయవంతం కావాలని ఆకాంక్షవ్యక్తం చేశారు. గీతం రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డైరక్టర్ డాక్టర్ రాజా ఫణిపప్పు మాట్లాడుతూ యానిమేషన్ తయారీకి అవసరమైన విధంగా ఇంజనీరింగ్ సిలబస్‌ను అందుబాటులోకి తేవాలన్నది ఉద్దేశ్యమన్నారు. స్మార్ట్ జెన్ సంస్థ నిపుణులతో గీతం ఫ్యాకల్టీ సభ్యులు కలిసి పనిచేస్తారన్నారు. గీతం పారిశ్రామిక సంబంధాల విభాగం అధిపతి సోమ్ భట్ మాట్లాడుతూ నూతన పద్ధతిలో ఇంజనీరింగ్ విద్య సులభంగా అవగాహనకు యానిమేషన్ వీడియోలు దోహదపడతాయన్నారు. స్మార్ట్ జెన్ సిఇఒ నవీన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో డిజిటల్ బోధనకు తమ యానిమేషన్ వీడియోలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

జి 20 పేరుతో ప్రజాధనం వృథా

- రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి - 20 సదస్సు పేరుతో ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేసిందని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, ఫోరమ్ ఫర్ బెటర్ విశాఖ ప్రతినిధి ఇఎఎస్.శర్మ తెలిపారు. గురువారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జి 20 సదస్సులో పాల్గొనే విదేశీయులకు విశాఖలో ఉన్న వేలాది మంది మురికివాడ ప్రజల పరిస్థితి కనిపించకుండా జివిఎంసి సిబ్బంది రెండు రోజుల క్రితం ఆకుపచ్చని పరదాలతో కప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు. విదేశీ ప్రతినిధులకు అసలు పరిస్థితి చూపించకుండా బీచ్‌లో, స్టార్ హోటళ్ల పరిసరాల్లో సుందరీకరణ కోసం జివిఎంసి సుమారు రూ.150 కోట్ల ప్రజాధనాన్ని ఎలా దుర్వినియోగం చేసిందో విశాఖ వాసులు చూశారన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ కార్పొరేటర్లు అటువంటి ఖర్చులకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. తాజా పనులు కేవలం కాంట్రాక్టర్లకు లాభాలు కలిగించేవేగానీ ప్రజలకు ఉపయోగపడవన్నారు. జివిఎంసి బడ్జెట్‌లో 40 శాతం నిధులను మురికివాడలలో కనీస సౌకర్యాల కోసం ఖర్చు చేయాలిగానీ కార్పొరేషన్ ఆ పని చేయడం లేదని తెలిపారు. బీచ్ పనుల్లో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని, కోస్తా నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర విజిలెన్స్ విభాగం ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జి 20 సమావేశాల సాకుతో జివిఎంసి వందలాది మంది చిరు వ్యాపారుల దుకాణాలను, తోపుడు బండ్లను ప్రొక్లైనర్లతో నేలమట్టం చేసిందని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించకుండా తరలించడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు.

రూ.కోట్లు దుర్వినియోగం : జనసేన

జి-20 సదస్సు పేరిట జివిఎంసి అధికారులు రూ.కోట్ల ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. తెన్నేటి పార్క్ సమీపంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా రూ.10 ఖర్చు అయ్యే పనికి రూ.వెయ్యిగా చూపించి షార్ట్ టెండర్ పేరిట రూ.కోట్ల దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. నగరంలో రెండు చోట్ల సాధారణ పెయింటింగ్ పనులకు రూ.30 లక్షలతో టెండర్ పిలిచిన అధికారులు నిజానికి అక్కడ రూ.2 లక్షల విలువైన పనులే చేశారని తెలిపారు. నగరంలో మిగిలిన ప్రాంతాల్లో పెయింటింగ్‌కు మీటర్‌కు రూ.500 ఖర్చు చేస్తున్న జివిఎంసి, తెన్నేటి పార్కు వద్ద సాధారణ పెయింటింగ్ పనులకు మీటర్‌కు రూ.లక్షన్నర వెచ్చించిందని వివరించారు. సమావేశంలో పార్టీనాయకులు పెసల శ్రీను, బి.రవికుమార్, చిన్నబాబు, రూప, పీతల రాజు పాల్గొన్నారు.

నీటిశుద్ధి పరికరాల అందజేత



పోలీస్‌స్టేషన్‌కు అందజేసిన నీటి శుద్ధి పరికరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రుషికొండ సముద్ర తీర భద్రతా పోలీస్‌స్టేషన్‌కు రూ.26 వేలు విలువైన రెండు వాటర్ ప్యూరిఫైయర్లను భీమిలి మండలం, చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్ గురువారం అందజేశారు. వీటిని పోలీస్‌స్టేషన్‌లో సిఐ సిహెచ్ చంద్రశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళీకృష్ణ, దివీస్ ప్రతినిధి పి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

రాజుకు ఘననివాళి

ప్రజాశక్తి- వేపగుంట : ఇటీవల మృతి చెందిన 93వ వార్డు వైసిపి అధ్యక్షుడు దాసరి రాజుకు పలువురు ఘననివాళులర్పించారు. దాసరి రాజు జయంతి సందర్భంగా గురువారం ప్రహ్లాదపురం జంక్షన్, శివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, దాసరి రాజు కుటుంబసభ్యులు, వైసిపి నేతలు ఆదిరెడ్డి మురళి, బండి సత్తిబాబు, దాసరి సత్తిబాబు, హరి, నిర్మల, సిఐటియు నాయకుడు బలివాడ వెంకటరావు, పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ తులసీదాస్

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 40వ వార్డు నౌసేనాబాద్ మినీ మోటారు స్టాండ్ వద్ద గురువారం సిఐటియు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మల్కాపురం ట్రాఫిక్ సిఐ తులసీదాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ, ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించిన సిఐటియు మోటార్ యూనియన్ అభినందనీయులన్నారు. మండుతున్న ఎండలు నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రానికి తనవంతుగా రూ.వెయ్యి ఆర్థికసాయాన్ని అందించారు.కార్యక్రమంలో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా నాయకులు జి.అప్పలరాజు, సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, మోటార్ స్టాండ్ అధ్యక్షులు ఆర్.అప్పారావు ఉపాధ్యక్షులు జి.సత్యనారాయణ, కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి ఎం.అప్పారావు, సభ్యులు ఆర్.ధర్మారావు, అప్పలనాయుడు, తమ్మారావు, శ్రీను, కుమార్, సంతోష్ నాగబాబు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, తదితరులు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని భీమన్నదొరపాలెం పంచాయతీ ఎస్‌టి కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ట్రస్ట్ అందించిన ఆర్థికసాయం రూ.10 లక్షలతో ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బంటు కుమారి అప్పలసూరి, ఉపసర్పంచ్ జొన్నపిల్లి సత్తిబాబు, గ్రామ పెద్దలు గీతల దేముడు, గీతల అప్పన్న, తుమ్మి రామారావు, తుమ్మి పైడిరాజు, గీతల ఆక్కులు, ఆలయకమిటీ అధ్యక్షుడు గీతల దేవుడు, గీతల సంతోష, తుమ్మి తమ్మన్న, తుమ్మ గణేష్, గీతల ఎర్రినాయుడు ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధులు రామలక్ష్మి, అక్కిరెడ్డి దేవుడుబాబు, ప్రతినిధులు తమ్మిన నర్సింగరావు, సతీష్, పినిశెట్టి సింహాచలం నాయుడు పాల్గొన్నారు

కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం



పరిహారం చెక్కును అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ: హెచ్‌పిసిఎల్‌లోని జ్ఞానసాయి ఇంజినీరింగ్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ, మృతి చెందిన కార్మికుడు వై.సుధాకర్ కుటుంబానికి సంస్థ తరపున అధినేత జనార్ధనరావు రూ.20 లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు. హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మజ్జి సోమేష్ సమక్షంలో 61వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దాడి సత్యనారాయణ చేతుల మీదగా మృతుని కుటుంబానికి నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు బోగవెల్లి కరుణాకర్ పాల్గొన్నారు,

మోడీ విధానాలను ఓడించడమే లక్ష్యంగా

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న లక్షలాది మంది కార్మికులతో సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన తలపెట్టిన చలో ఢిల్లీ ఆందోళనను జయప్రదంచేయాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంచుతూ, వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తూ, సన్నాహక సమావేశాలు, ర్యాలీలను నిర్వహిస్తూ బంద్ జయప్రదానికి పిలుపునిస్తున్నారు...

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న లక్షలాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులతో నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ ఆందోళనలో విశాఖ కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి పిలుపునిచ్చారు. గురువారం మద్దిలపాలెం కళాభారతి దరి సిఐటియు జోన్ కార్యాలయం నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ ఈనాడు, సీతమ్మధార, హెచ్‌బి. కాలనీ మీదుగా వెంకోజిపాలెం, ఎంవిపి, పెదవాల్తేరు, రామా టాకీస్ మీదుగా తిరిగి మద్దిలపాలేనికి బైక్‌ర్యాలీ చేరుకుంది.

ఈ సందర్భంగా సిఐటియు నేత మణి మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తూ, కార్మికచట్టాలను సంస్కరించి, లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను కాలరాస్తోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆదానీ, అంబానీ కార్పొరేట్ల సేవలో తరిస్తోందని మండిపడ్డారు. కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, హక్కుల కోసం కార్మికవర్గం పోరాడుతున్నా మోడీ ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. నిరుద్యోగం, అధిక ధరలు, పేదరికం, ఆకలి మంటలు దేశాన్ని చుట్టుముడుతోంటే, జిడిపి వృద్ధి చెందుతోందంటూ బూటకపు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో మోడీ విధానాలను ఓడించడమే లక్ష్యంగా లక్షలాది మందితో చేపట్టే చలో ఢిల్లీ ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్ష కార్యదర్శులు జే.ఆర్. నాయుడు, పి.వెంకట్రావు, నాయకులు కే.కుమారి అనపర్తి అప్పారావు దల్లి రవి, ఏ.సింహాచలం, అప్పారావు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

కలెక్టరేట్ : దేశ సంపదను వృద్ధి చేయడంలో కీలకభూమిక నిర్వహిస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రచట్టం చేసి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని హమాలీ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. గురువారం టిఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద ఎం. సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏప్రిల్ 5 చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. చలోఢిల్లీ ర్యాలీలో రైతులు, కౌలురైతులు, కూలీలు,కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదంచేయాలని కోరారు. సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ ముఠా కళాసీలకు సమగ్ర చట్టం చేసే వరకు పోరాడుతామని, పిఎఫ్ ఇఎస్ఐ, పెన్షన్ బీమా ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. రాబోయే తరానికి జీవనోపాధి, ఉద్యోగావకాశాలు కల్పనకు ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో హమాలీ నాయకులు నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

కలెక్టరేట్: ఆటో మోటార్ కార్మికులకు రక్షణ కల్పించే విధంగా సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) నేత కె సత్యనారాయణ అన్నారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదానికి ఆటో కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు కనీస రక్షణ లేదని, ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే, వారి కుటుంబం రోడ్డున పడాల్సిందేనన్నారు.ఆటో, మోటార్ కార్మికులపై దాడులు ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటీసులు రద్దు చేస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు పి.రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షులు బి.జగన్, నాయకులు జిఎస్ ప్రకాష్, శ్రీధర్, ఎల్లారెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.



మద్దిలపాలెంలో బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు నేత మణి

కె.కోటపాడు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలో చౌడువాడ, పైడంపేట, మేడిచర్ల, సూరెడ్డి పాలెం, రొంగలి నాయుడుపాలెం, ఎ.కోడూరు, ఆర్‌వై అగ్రహారం, గొండుపాలెం, వి.సంతపాలెం, ఆనందపురం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, కనీస పెన్షన్ కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టైం స్కేల్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.600, ఇవ్వాలని, ఏడాదికి 200 పని దినాల కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకులు రొంగళి ముత్యాల నాయుడు, వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డాది : ఉపాధి హామీ చట్టం రక్షణకై ఏప్రిల్ 5న చలో ఢిల్లీకి తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పినపాత్రని సాంబశివరావు పిలుపునిచ్చారు. బుచ్చయ్యపేట మండలం లోపూడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని, ఇందులో భాగంగా దీనికి ప్రతి ఏటా నిధులు తగ్గిస్తూ వస్తుందని చెప్పారు.

మునగపాక రూరల్ : ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మునగపాక మెయిన్ రోడ్‌లోని సహకార సంఘం ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ధరలు పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగితేలుతుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తుందని, పేదలపై భారాలు మోపుతుందని పేర్కొన్నారు. కార్మికులను, యజమానులు కట్టు బానిసలుగా చేసే కార్మిక చట్టాలు మార్పు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కాంట్రేగుల రాము, ఆళ్ళ మహేశ్వరరావు, టెక్కలి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే దేశ రక్షణ బేరిలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.సత్తిబాబు పిలుపునిచ్చారు. గురువారం పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వీధుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులన్నీ కొంతమంది వ్యక్తులకు ధారాదత్తం చేశారని, విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలు రద్దు చేసారని, ఫలితంగా కార్మికులకు రక్షణ కరువైందన్నారు. స్కీం వర్కర్లకు రూ.26 వేల కనీసం వేతనాలు అమలు చేయకుండా పని భారం పెంచారన్నారు. ఏప్రిల్ 5 న ఢిల్లీలో జరిగే బహిరంగ సభకు కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో కె.నానాజీ, గోవిందు, రమణ కార్మికులు పాల్గొన్నారు.



జగదాంబ వద్ద ఆటో రిక్షా కార్మికుల సమావేశం



పోస్టర్ల ఆవిష్కరణలో మాట్లాడుతున్న వై.రాజు



వడ్డాదిలో కూలీలతో మాట్లాడుతున్న సాంబశివరావు



నర్సీపట్నంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కె.కోటపాడులో మాట్లాడుతున్న నాయనబాబు



మునగపాకలో పోస్టర్ల ఆవిష్కరణ

అకాల వర్షాలతో ఉప్పు పంటకు ముప్పు

- రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు
- దిగుబడి వచ్చే సమయంలో దెబ్బతీసిన వరుణుడు



ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పు మడుల్లో చేరిన నీరు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఉప్పు పంటను తీవ్రంగా దెబ్బతీసింది. వర్షానికి మడుల్లో నీరు చేరడంతో ఉప్పు రైతుల ఆదాయానికి ముప్పు వాటిలింది. ఉప్పు పంటకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. గట్లు వేయించారు. కాలువలు తవ్వించారు. ఉప్పు మడుల నేలను మనుషులతో తొక్కించి చదును చేయించారు. నవంబర్ నెల నుంచి పనులు ప్రారంభించగా డిసెంబర్ నాటికి పూర్తయ్యాయి. జనవరి నెల నుంచి ఉప్పు పండడం ప్రారంభమైంది. ఫిబ్రవరిలో ఆశించిన స్థాయిలో ఉప్పు పంట దిగుబడి రాలేదు. మార్చి నెలలో ఎండలు కాసి వాతావరణం వేడెక్కడంతో ఉప్పు పంట వేగం అందుకుంది. ఉప్పు రైతులు తాము ఆశించిన రోజులు దగ్గర పడ్డాయని ఆనందం పడ్డారు. ఇంతలోనే ఆకాలంగా వర్షాలు వారీ ఆశలను ఆవిరి చేశాయి. వరుసగా వారం రోజులపాటు వర్షాలు పడడంతో గట్లు దెబ్బతిన్నాయి. ఉప్పు మడుల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో పంట అర్ధాంతరంగా ఆగిపోయింది. అంతేకాకుండా ఇప్పటివరకు పండించిన ఉప్పు పంట గట్లపై వేయగా వర్షానికి కరిగిపోయి నష్టం కలిగింది.

జిల్లాలో 2000 ఎకరాల్లో ఉప్పు పంట సాగు చేస్తున్నారు. పరవాడ మండలం వాడచీపురుపల్లి, ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం, అచ్యుతాపురం మండలం పూడిమడక తదితర తీర ప్రాంతాల్లో ఏటా వేల టన్నుల ఉప్పును పండిస్తుంటారు. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన ఉప్పును అమ్ముకుంటూ సంవత్సరం పాటు ఉప్పు రైతులు జీవనం సాగిస్తుంటారు. పూడిమడక సముద్రతీరంలో శ్రీశ్రీనివాస సాల్ట్ ఫాన్ వర్కర్స్ సొసైటీ ఆధ్వర్యంలో 25 ఎకరాల విస్తీర్ణంలో 56 మంది రైతులు ఉప్పు పంట సాగు చేస్తున్నారు. ఒక్కొక్క రైతు రూ.30 వేలు పైనే పెట్టుబడి పెట్టారు. అంటే వీరంతా సుమారు రూ.17 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు.

ఉప్పు పంటకు కావలసిన ప్రధాన వనరులు ఉప్పు నీరు, అత్యధిక ఉష్ణోగ్రత. ఈ రెండు సమృద్ధిగా ఉంటే తక్కువ కాలంలో ఎక్కువ మొత్తంలో ఉప్పు దిగుబడి వస్తుంది. మార్చిలో పంట దిగుబడి బాగా వస్తుందని ఆశించిన సమయంలో అకాల వర్షాలు వారి ఆశలను కరిగించి వేశాయి. మరో నెల రోజుల వరకు ఉప్పు పండించడానికి వీలుపడదు. అప్పటికైనా వాతావరణం బాగుంటేనే ఉప్పు పండించిన వీలుపడదని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి



ఉప్పు పండించే రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలి. అయోడైజ్డ్ ఉప్పు తయారీకి కావాల్సిన యంత్ర సామాగ్రి, పెట్టుబడి, నిర్వహణ ఖర్చు వంటివి ఇవ్వాలి. ఉప్పు పండించే రైతులు ఎండ నుంచి సేద తీరడానికి షెడ్డు నిర్మించాలి. వర్షాలకు కరిగిపోకుండా స్టాకు వేయడానికి ధర పలికినప్పుడు విక్రయించడానికి వీలుగా షెడ్లు నిర్మించాలి.

- సమ్మంగి గోపి, ఉప్పు రైతు, పూడిమడక, అచ్యుతాపురం మండలం.


ఉప్పుపై కప్పిన టార్పాలిన్లు (ఫైల్‌ఫొటో)


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బాలకృష్ణ

అదానీ అవినీతిని ప్రశ్నించినందుకే

ప్రతిపక్షాలపై బిజెపి సర్కారు కక్ష

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి

దేశ సంపదను లూటీ చేస్తున్న అదాని అవినీతిని ప్రశ్నించినందునే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలు కక్షపూరితంగా వ్యవహరిస్తోందని అఖిలపక్ష నాయకులు విమర్శించారు. అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన స్థానిక సిపిఐ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐఆర్ గంగాధర్ అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ బిజెపి అవినీతిని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీపై మోడీ ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఈడి, సిబిఐ వంటి సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అవినీతిపరులు బిజెపిలో చేరితే వారి అవినీతి పోతుందని, అదే ప్రతిపక్షంలో ఉంటే అవినీతిపరులుగా బిజెపి ముద్ర వేస్తోందని తెలిపారు. దేశ సంపద, సహజ వనరులు, మౌలిక వసతులను అంబాని, అదానిలకు అడ్డదారిలో కట్టబెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల సంపదను దోచిపెడుతుందని విమర్శించారు. సిపిఐ జిల్లా నాయకులు వైఎన్ భద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ దేశ సంపదను, బ్యాంకులను కొల్లగొట్టిన అదాని మోడీ అండదండలతో ప్రపంచ కుబేరుల్లో స్థానం దక్కించుకున్నారని తెలిపారు. బిజెపి ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రుత్తల శంకర్రావు, సిపిఐ నాయకులు కోరిబిల్లి శంకర్రావు, తాకాసి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్, బుద్ధ కిషోర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కెవి రమణ, బాబ్జి, దొరబాబు పాల్గొన్నారు.

నేడు కొక్కిరాపల్లి పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి -యలమంచిలి : మండలంలోని కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఆ సంఘం ఛైర్మన్ మళ్ల కొండబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పాత రుణాలు చెల్లించడానికి ఆసక్తి చూపకపోవడంతో ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ గురించి ప్రధానంగా చర్చ జరుగుతుందని, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

సిపిఎం నేత మళ్లకు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ

ప్రజాశక్తి -అనకాపల్లి : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సిపిఎం సీనియర్ నాయకులు మళ్ల సత్యనారాయణను గురువారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు ఉన్నారు.

రబీకి ఎరువుల కొరత

- అలంకారప్రాయంగా ఆర్‌బికెలు
- ప్రైవేటు షాపుల్లో సైతం దొరకని వైనం
- ఇబ్బందులు పడుతున్న రైతులు


చౌడువాడలో రబీ వరి పొలం

ప్రజాశక్తి-కె.కోటపాడు

రబీ పంటకు కావాల్సిన ఎరువులు మండలంలో ఎక్కడా లభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చోడవరం, అనకాపల్లి వంటి ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రైతు భరోసా కేంద్రాలు, కో-ఆపరేటివ్ సొసైటీలతో పాటు మండలంలోని ప్రైవేటు షాపుల్లో సైతం ఎరువులు దొరకడం లేదు.

మండలంలోని నీరు లభించే పల్లపు ప్రాంతాలైన చౌడువాడ, గరుగుబిల్లి, మల్లంపాలెం, పైడంపేట, పాచిలవానిపాలెం, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల తదితర గ్రామాలలో రబీ సీజన్లో రైతులు దాల్వా వరి సాగు చేశారు. వరిపంటకు ఇప్పుడు ఎరువులు వేయాలి. నువ్వులు, వేరుశనగ పంటలతోపాటు, చెరకు కటింగ్ చేసి సుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేసిన కార్షి తోటలకు కూడా ఎరువులు అవసరం ఉంది. ఈ పంటలకు కావలసిన యూరియా, పటాస్, గ్రోమోరు మొదలగు ఎరువులు ప్రస్తుతం మండలంలోని ఏ రైతు భరోసా కేంద్రాల్లోనూ, కో-ఆపరేటివ్ సొసైటీల్లోనూ లభించడం లేదు. అధిక ధర చెల్లించి ప్రైవేటు డీలర్ల వద్దనైనా కొనుగోలు చేద్దామనుకుంటే వారి వద్ద కూడా సుమారు నెల రోజుల నుంచి ఎరువులు దొరకడం లేదు. దీంతో ఒక బస్తా, రెండు బస్తాలు కావలసిన రైతులు మోటార్ బైక్‌ల మీద, ఎక్కువ కావాల్సిన వారు ఆటో కిరాయికి తీసుకొని చోడవరం, అనకాపల్లి వెళ్లి తెచ్చుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఎరువులు కొరత అధికంగా ఉందని రైతులు వాపోతున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతాలలో రైతులు ఎల్లప్పుడూ ఏదో ఒక పంట సాగు చేస్తూ ఉంటారు. వారికి ఎల్లవేళలా ఎరువులు అవసరం ఉంటుంది. అవసరానికి ఎరువులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర రైతు ఇబ్బంది పడుతున్నారు. రైతులకు కావలసిన అన్ని రకాల ఎరువులు, క్రిమిసంహారక మందులు, పనిముట్లు అందించడానికి ప్రభుత్వం మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ కోసం వ్యవసాయ సహాకులను నియమించింది. కాని ఇవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఏ రైతు భరోసా కేంద్రంలోనూ ఎరువులు లభించకపోవడంతో వాటి వల్ల తమకు ఉపయోగం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వ్యవసాయాధికారి వివరణ

ఎరువుల కొరతపై మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా, మండలంలో వరి పంటలు సాగు చేసినట్లు తమకు తెలియదని చెప్పారు. ప్రస్తుత సమయంలో ఎరువుల అవసరం ఉండదని ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలకు, కో-ఆపరేటివ్ సొసైటీలకు ఎరువులు తెప్పించలేదని తెలిపారు. రైతులకు ఎరువులు అవసరం అనుకుంటే సొసైటీల ద్వారా తెప్పించడానికి ప్రయత్నం చేస్తామని వెల్లడించారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి

గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో కాశీ బాబా ఆలయం వద్ద గురువారం మల్ల భువనేశ్వరరావు జయంతి సందర్భంగా బుద్ధ భూలోక నాయుడు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రాజేష్, జోగి నాయుడు, విల్లూరి జోగేష్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వందమంది పేదలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీవీ రమణ, కొణతాల శ్రీనివాసరావు, బుద్ధ సన్యప్పారావు, కొణతాల ప్రసాద్, ఎల్లపు వాసు, పెంటకోట నాయుడు, ఆళ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖను భ్రష్టు పట్టిస్తున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖను పూర్తిగా భ్రష్టు పట్టిస్తోందని టిడిపి అనకాపల్లి జిల్లా మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులను కాజేయడం, భూములను దోచుకునేందుకు తెర లేపారని తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములను పరిరక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆర్థిక నేరస్తుడిగా ఉన్న ముఖ్యమంత్రి నేరాలు చేసే వారిని కాపాడుతూ కంచె చేను మేస్తున్న విధంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములను, బడుగు బలహీన వర్గాల భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు.

మన్యం బంద్‌తో నైట్ సర్వీసులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు

బోయ వాల్మీకి బొంతు కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలు ఈ నెల 31న బంద్‌కు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. విశాఖ నుండి చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులను గురువారం, శుక్రవారం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం నుంచి ఈ బస్సులు యథావిధిగా తిప్పుతున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దుప్పుటూరు గ్రామంలో గురువారం హెరిటేజ్ పాల సేకరణ కేంద్రాన్ని ఆ డెయిరీ మేనేజర్ కె శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు పోసిన రైతులందరికీ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్ రూ.50కు, ఆడపెయ్య పుట్టడానికి రూ.500కే కృత్రిమ గర్భధారణ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సహజంగా మరణిస్తే రూ.50 వేలు, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్రావు, కాసుబాబు, రాంబాబు, నానాజీ, చిరంజీవి, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.


పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హెరిటేజ్ మేనేజర్ శేషు

ప్రమాదకరంగా అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు

- నిత్యం వాహనాల రద్దీ
- తరుచూ ప్రమాదాలతో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- భారీ లారీలు, కంపెనీల బస్సులతో శిథిలమైన రహదారి
- అమలుకు నోచని మంత్రి, ఎంపీ హామీలు


ఎక్కడికక్కడ గోతులు పడి, బీటలు వారి ఉన్న అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి

ప్రజాశక్తి- మునగపాక రూరల్

రోడ్డు గుంతల మయం.. వాహనాల రద్దీ మయం.. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని భయం.. భయం.. వెరసి అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు మార్గం పరిస్థితి అత్యంత దయనీయం. రెండు దశాబ్దాలకు ముందు ఈ రోడ్డు మార్గం ప్రశాంతతకు మారుపేరుగా ఉండేది. ప్రమాదాలంటే ఈ మార్గం ప్రయాణికులకు తెలియని పరిస్థితి. అయితే అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో ఎస్ఇజెడ్‌లు ఏర్పాటు కావడం, పరిశ్రమలు రావడంతో ఈ మార్గం రద్దీగా మారింది.

అనకాపల్లి -అచ్యుతాపురం మార్గంలో కంపెనీలకు ముడి సరుకు తరలించే లారీలు, క్వారీ రాళ్లను సప్లై చేసే లారీలు 20 నుండి 25 టన్నుల లోడుతో మాత్రమే వెళ్లాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా 50 నుండి 60 టన్నుల లోడుతో వెళ్తున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా బీటలు వారి, విడిపోయి, ప్రమాద స్థాయికి చేరుతున్నాయి. ఈ కంపెనీల్లో పని చేసే కార్మికుల కోసం యాజమాన్యాలు బస్సులను, క్యాబ్‌లను నడపడంతో, ప్రైవేటు స్కూళ్ల కూడా పెరగడంతో ఈ మార్గంలో విద్యార్థుల స్కూల్ బస్సులు ప్రయాణించడంతో రోడ్డు ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఉద్యోగుల వాహనాలు, వ్యాపారవేత్తల వాహనాలు నిత్యం ప్రయాణిస్తున్నాయి. దీంతో ఈ రోడ్డు మార్గం ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నిత్యం వాహనాలు రాకపోకలు, భారీ వాహనాల ప్రయాణంతో అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు గుంతలతో పూర్తిగా ధ్వంసమైంది. షిఫ్ట్‌ల వారీగా కార్మికులను తీసుకువెళ్లే వాహనాలు పరిమితికి మించిన వేగంతో ప్రయాణించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పాదచారులు, వాహన చోదకులు పలువురు మరణించడం, క్షత గాత్రులు కావడం జరుగుతోంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక్కోసారి గుంతల రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి గంటల కొద్దీ ప్రయాణికులు మండుటెండలో నిరీక్షించే పరిస్థితులు దాపురిస్తున్నాయి. పగలు సరే సరి చీకటి పడితే బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది.


భారీ వాహనాల వల్ల దుమ్ము, ధూళితో నిండివున్న రహదారిలో ప్రయాణిస్తున్న దృశ్యం

నేతల మాటలు నీటి మూటలు

2022 అక్టోబర్ 5వ తేదీన మండల కేంద్రం మునగపాకలో తులసి కళ్యాణ వేదిక ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్ రోడ్డు నిర్మాణ పనులను వారం రోజుల్లోగా చేపడతామని చెప్పారు. కొద్ది నెలల క్రితం అచ్యుతాపురంలో జరిగిన ఓ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ మాటలన్నీ నీటి మూటగానే మిగిలిపోయాయి.

ఇటీవల కాలంలో రోడ్డు మార్గం ద్వారా ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లను గుర్తించి తిమ్మరాజుపేట గ్రామస్తుడు ఆడారి రామకృష్ణ తన సొంత నిధులతో గుంతలలో క్రషర్ గ్రావెల్ వేసి తన ఉదారతను చాటుకున్నారు. అయితే ఇంకెన్నాళ్లు ఈ పరిస్థితి..? రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ప్రమాదాలను అరికట్టాలని రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలు చేసిన ధర్నాలు, రాస్తారోకోలు అరణ్య రోదనగానే మిగిలిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు రోడ్డు విస్తరణ చేపట్టాలని, ఈ లోగా నిర్మాణ పనులు చేపట్టి, ప్రమాదాలను అరికట్టాలని వాహన చోదకులు ,పాదచారులు కోరుకుంటున్నారు.

గున్నెంపూడి రహదారి గుంతలమయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని వెదుర్లగడ్డ నుండి గున్నెంపూడి వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడంతో వాహనాలదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉప్పరగూడెం, పెద్దమదిన, కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో పెద్ద పెద్ద గొయ్యలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై పడిన గుంతల్లో నీరు చేరి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతిరోజు రావికమతం మండలంలోని పలు గ్రామాల నుండి వందలాదిమంది, బుచ్చయ్యపేట మండలం గున్నెంపూడి పెద్దమదిన తదితర గ్రామాలకు చెందిన వందలాదిమంది భవన నిర్మాణ పనుల నిమిత్తం ప్రతిరోజు అనకాపల్లి ద్విచక్ర వాహనాలపై రాకపోకల సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో వాహనాలు మరమ్మతులు గురవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతురు చేపట్టాలని కోరుతున్నారు.


పెద్ద పెద్ద గోతులు ఉన్న గున్నెంపూడి రహదారి

ఇటుకల పండగ సందడి ఆరంభం

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రతి ఏడాది సాంప్రదాయ కంగా జరుపుకునే ఇటుకల పండుగ మండలంలో సందడిగా ఆరంభమైంది. ఈనెల 27న కొన్ని ప్రాంతాల్లో పండుగను జరుపుకోగా మరికొన్ని ప్రాంతాలలో 30న పండుగను మొదలుపెట్టారు. ప్రాంతాలను బట్టి వివిధ రూపాలలో పండుగను నిర్వహించుకుంటారు. పండుగ ముందుగానే ఇల్లులకు రంగులు చల్లి ముస్తాబు చేసుకుంటారు. కుటుంబ సభ్యులంతా కొత్త వస్త్రాలు ధరించుకుంటారు. వరి, సామలు వంటి విత్తనాలను వేరు వేరుగా బుట్టలలో పెట్టుకొని ఇంటి మూలన పెట్టుకొంటారు. మూడు లేదా తొమ్మిది రోజులు జరుపుకునే ఈ పండుగ చివరి రోజు గ్రామ శివారులో చక్కుదేవత వద్దకు గ్రామస్తులంతా రాత్రి చేరుకొని విత్తనాలను చక్కు దేవత వద్ద ఆ రాత్రంతా ఉంచుతారు. అనంతరం ఆ విత్తనాలను ప్రతి ఇంటింటికి పంచుకుంటారు. ఈ విత్తనాలతో పాటు ఇంట్లో ఉన్న విత్తనాలు కలిపి పంట పొలాలలో జల్లుకుంటారు.పండుగ సమయంలో దింసా నృత్యాలతో గ్రామాలలో కోలాహలం నెలకొంటుంది. చిన్న పిల్లలు సైతం రంగులు పూసుకుంటారు.

అరకు ప్రధాన రహదారిపై టోల్ గేట్లు ఏర్పాటు చేసుకుని వాహనదారుల నుండి చందా వసూలు చేస్తారు. వచ్చిన మొత్తం డబ్బులలో గ్రామస్తులంతా కలిసి చివరి రోజు భోజనాలు ఏర్పాటు చేసుకుని పిల్ల పాపలతో తింటారు. ఈ రకంగా పండుగ నిర్వహించుకుంటే పంటలు బాగా పండుతాయని గిరిజనుల నమ్మకం.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు


మాకవరపాలెంలో నిర్వహిస్తున్న కల్యాణం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

మాకవరపాలెం: శ్రీరామ నవమి సందర్భంగా తామరం, కొత్త చంద్రయ్యపాలెం, గంగవరంలోని రామాలయాల్లో పండగ వాతావరణం నెలకొంది. తామరంలో టిడిపి నాయకుడు కోసూరు శ్రీను దంపతులు ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

నర్సీపట్నంటౌన్: పట్టణంలో అతి పురాతన దేవాలయం మేదర వీధి రామాలయం, రామారావు పేట, పీనారిపాలెం, కొత్త వీధి, వెంకనాయుడుపేట, శారద నగర్ సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దబొడ్డేపల్లి, బలిఘట్టం రామాలయాల్లో ఉదయం నుండి భక్తులు బారులు తీరారు.

కోటవురట్ల:కోటవురట్ల, కైలాస పట్నం, సహా పలు గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు.కళ్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

పాయకరావుపేట:మండలంలోని పాల్తేరు గ్రామం లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవవరపు రాంబాబు రాము, మాధవి దంపతులు 60 సెంట్ల పంట భూమిని సీతారాముల ఆలయానికి విరాళంగా అందజేశారు. అనంతరం గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నర్సీపట్నంరూరల్:అభిద్ సెంటర్లో అయ్యరక రామాలయంలో వైభవంగా సీతారామస్వామి కళ్యాణం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు స్వామి వారిని దర్శించుకుని కళ్యాణ మహోత్సవమును తిల కించారు.

భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం రూరల్:శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కళ్యాణానికి నర్సీపట్నం డిపో నుండి ప్రత్యేకంగా బస్సులు నడిపారు. బుధవారం సాయంత్రం ప్రత్యేక బస్సుల్లో భక్తులు వెళ్లారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ ధీరజ్ మాట్లా డుతూ, బస్సులను భక్తులు వినియోగించుకోవాలని సూచించారు.

గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కరనాయుడు దంపతులు, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లగుడు ప్రకాష్, చింతల మురళి, లగుడు మురళి, ఎంపిటిసిలు చింతల బుల్లిప్రసాద్, మామాడి కృష్ణ, పెదపూడి శివ సత్యనారాయణ, కుండల పెదబాబులు పాల్గొన్నారు. సిహెచ్.నాగాపురం, పాతకృష్ణదేవిపేట, లింగంపేట పంచాయతీ శివారు గైరంపేట, జానకిరాంపురం రావణాపల్లి, పాకలపాడు తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:తిమ్మాపురంలోని సీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోకులపాడు గ్రామంలో శ్రీరామనవమి పండగ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఎజి ఫౌండేషన్ నాగంబోయిన బ్రదర్స్ పరీక్షా సామగ్రిని అందజేసారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ, నాగంబోయిన శేషు, నాగంబోయిన శ్రీనివాసు, కార్తీక్, క్రేజీ బాయ్స్, ప్రగడ ప్రసాద్, శ్రీనివాసు పాల్గొన్నారు.

అనకాపల్లి : పట్టణంలోని పూడిమడక రోడ్డు రామాలయం, చేపల బజారు, వెల్లుల వీధి, కోట్ని వీధి, నెయ్యల వీధి మల్ల వీధి, బోయగూడెం చిన్న రామస్వామి ఆలయం, దిబ్బ వీధి ప్రాంతాలతో పాటు మండలంలోని తుమ్మపాల, దిబ్బపాలెం, బవులవాడ, మార్టూరు, చింతనిప్పుల అగ్రహారం గ్రామాల్లో పెద్ద ఎత్తున శ్రీ రామనవమి వేడుకలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, వైసిపి నాయకులు దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, గుల్లేపల్లిలో ఎంపిపి బోకం సూర్యకుమారి, బోకం రామునాయుడు, సర్పంచ్ బండారు మంగ, బండారు శ్రీనివాసరావు, మల్లునాయుడు పాలెంలో సర్పంచ్ బోను దేముడమ్మ బోను గంగునాయుడు, ఎంపిటిసి గొర్లి కనకరాజు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సీతారాముల ఆలయ ప్రాంగణంలో జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు 1800 మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు ఈ సంస్థ ప్రతినిధి ప్రసాద్ తెలిపారు.

మునగపాక రూరల్:మండల కేంద్రం మునగపాక పంచాయతీ వీధి, మంద బయల, దళిత కాలనీ, చెట్టు బలిజ కాలనీ, సంతబయలులో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వాడ్రాపల్లిలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

దేవరాపల్లి: మండలంలోని తారువలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కళ్యాణ వేడుక ఏర్పాట్లను గ్రామ పెద్దలు, యువతతో కలిసి పర్యవేక్షించారు. అన్న సంతర్పణలో పాల్గొన్నారు. దేవరాపల్లి, సంజీవమెట్ట, రామాలయంలో సీతారాముల కళ్యాణం జరిగింది.

చోడవరం:గోవాడ, అన్నవరం, చోడవరం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. గోవాడలో అన్న సమారాధనలో ఆయన స్వయంగా వడ్డించారు.

కె.కోటపాడు:చౌడువాడ గ్రామంలో జరిగిన అన్న సమారాధనలో గ్రామ సర్పంచ్ దాడి ఏరుకు నాయుడు. సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట, తురకలపూడి గ్రామాలలో భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

పరవాడ : సోమినాయుడుపాలెంలో టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా దంపతులు సీతారాములు కళ్యాణ పూజలో పాల్గొన్నారు. తానాంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు సునీత గోపాలకృష్ణ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : మున్సిపాలిటీ పరిధి 20వ వార్డు పెద్దపల్లిలో సీతారాముల కళ్యాణం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. మహిళలు సీతమ్మ సారె ఊరేగింపు ఘనంగా జరిపారు.

అచ్యుతాపురం:మండలంలోని తిమ్మరాజుపేట, పెదపాడు, జగ్గంపేట, కొండకర్ల, హరిపాలెం, చీమలపల్లి, ఎర్రవరం, ఎం జగన్నాథపురం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

పద్మనాభం: మండలంలోని ఐనాడ పంచాయతీ యాతపేటలో యారబాటి రమణ, అనంతవరంలో జి పెద్ద ఎర్రినాయుడు, రెడ్డిపల్లిలో ఉపసర్పంచ్ శిరుగుడి ఆదినారాయణ, మద్దిలో ఎంపిపి కె రాంబాబు. సర్పంచ్ బి సన్యాసమ్మ దంపతుల ఆధ్వర్యంలోసీతారాముల కల్యాణం, అన్నసమారాధనలను ఘనంగా నిర్వహించారు.

మధురవాడ : మధురవాడ జోన్ పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీ, మల్లయ్య పాలెం, గణేష్‌నగర్, బైలర్స్‌కాలనీ, వైయస్సార్‌నగర్ కాలనీల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం, పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌నగర్ కాలనీలో మహిళలు వంద రకాల వంటకాలతో సీతారాములకు సారె సమర్పించారు. 5వ వార్డు మాజీ కార్పొరేటర్, వార్డు వైసిపి అధ్యక్షుడు పోతిన హనుమంతరావు ఆర్థిక సహాయంతో ఐదువేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఏడవ వార్డు మహిళా అధ్యక్షురాలు చేకూరి రజని, అప్పారావు పాల్గొన్నారు.

పెందుర్తి : పాతూరు, బీసీ కాలనీ, సత్తివానిపాలెం, సాయి మాధవనగర్, చిన ముసిడివాడ తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ చినఅప్పలనాయుడు, శ్రీనివాసరావు ఎల్.అప్పలనాయుడు, శ్రీను పాల్గొన్నారు

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడీసాయిబాబా ఆలయంలో రాములోరి కల్యాణంలో 200 మందికి పైగా దంపతులు పాల్గొన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, ఉత్సవ కమిటీ ప్రధాన కర్త బుడ్డిగ సత్యనారాయణ ఆలయ పురోహితులు నగేష్ శర్మ బృందం ఆధ్వర్యంలో కల్యాణవిందు ఏర్పాటు చేశారు.

13వ వార్డులో..ఆరిలోవ, వెర్రిదుర్గానగర్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి తూర్పు సమన్వయకర్త, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు, కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

సింహాచలం: సింహాచలం దేవస్థానానికి అనుబంధ దేవాలయమైన గంగధార సీతారామాలయంలో అర్చక స్వాములు, స్థానాచార్యులు కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఇఇ శ్రీనివాస్ రాజు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజు, సువ్వాడ శ్రీదేవి పాల్గొన్నారు. కొండ దిగువ నామాలయం, అడవివరం రామాలయం, ప్రియ గార్డెన్స్, తోటమరోతు రాము ఇంటి వద్ద సీతారాముల కల్యాణోత్సవాలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

సింహాచలం: రామతీర్థంలోని సీతారాములకు శ్రీరామనవమి సందర్భంగా సింహాచల దేవస్థానం తరపున ఇఇ వి.త్రినాధరావు దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలు, పండ్లు స్వయంగా రామతీర్థం తీసుకెళ్లి అందజేశారు. దినికోసం గురువారం ఉదయం సింహాచలం నుంచి బయలుదేరి ఈవో దంపతులు రామ తీర్థాలులోని చేరుకొని కళ్యాణంలో పాల్గొన్నారు.


సీతమ్మధార : క్షత్రియ సంక్షేమ సమితి, సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో శ్రీరామనవమి వేడుకలలో సిరి వెంకటేశ్వర డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కెకె రాజు, నడింపల్లి శ్రీనివాసరాజు కోడూరుపాడు దంపతులు పాల్గొని, కల్యాణ వేడుక నిర్వహించారు.


వేడుకల్లో పాల్గొన్న సంపంగి శ్రీనివాసరావు దంపతులు

వైభవంగా సీతారాముల కల్యాణం

సీతమ్మధార : వైసిపి నేత, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో పార్వతీశ్వరాలయం వద్ద పూలమండపంలో సీతారాముల పంచలోహ ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని కనుల విందుగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పసుపు కుంకుమ, పండ్లు, పువ్వులు, పలు మిఠాయిలతో సారె సమర్పించారు. అన్నమయ్యవేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

సీతమ్మధార : సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణం లో స్వాతి ప్రమోటర్స్ సంస్థ ఎండి.రమేష్ రెడ్డి పాల్గొని, స్వామిలోరికి ముత్యా ల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా విశేష పూజలు నిర్వహించారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న రమేష్‌రెడ్డి


విరాళం అందిస్తున్న పైలా ప్రసాదరావు

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి-మాడుగుల: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా మండలంలోని వీరవల్లి అగ్రహారంలో రామాలయంలో జరిగిన పూజలలో టిడిపి నేత పైల ప్రసాద్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి పైలా ప్రసాదరావు రూ.10వేల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పుప్పాల అప్పలరాజు, పాచిల నగేష్, పాచిల రమణ, సయ్యపరెడ్డి శ్రీనివాసరావు, వెంకట్రావు, సత్తిబాబు, రామన్న దొర, సుంకర లక్ష్మీ రావు, దాడి వీరబాబు, దాడి కొండా జి,తలారి మాధవ తదితరులు పాల్గొన్నారు.


కళాకారుడిని సన్మానిస్తున్న బృందం సభ్యులు

ఉపమాకలో ముగిసిన సప్తాహం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద శ్రీనివాస భక్త సమాజ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సప్తాహం (భజన) గురువారం ఉదయం 6 గంటలకు ముగిసింది. ఈనెల 23వ తేదీ ఉదయం 6 గంటల కు ప్రారంభమైన సప్తాహం 30వ తేదీ ఉదయం 6 గంటల వరకు 7 రోజులపాటు భజన కార్యక్రమం నిర్వహించారు .అనేక గ్రామాల నుండి భజన బృంద సభ్యులు సప్తాహం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో కళాకారులను ఘనంగా సన్మానించారు.


పరీక్షిస్తున్న వైద్యులు

గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని మత్స్యకార గ్రామాలైన రేవుపోలవరం, కొత్తరేవు పోలవరం గ్రామాలలో వైద్యశిబిరం నిర్వహించినట్లు పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పి రాజేశ్వరి తెలిపారు. గురువారం రేవుపోలవరం కొత్తరేవుపోలవరం గ్రామాల నడుమ వైద్య శిబిరం ఏర్పాటు చేసి మత్స్యకారులకు వివిధ రకాల రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భవతులకు వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని నక్కపల్లి, అనకాపల్లి ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు చోడిపల్లి గోవిందు, లోవరాజులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీడి రోజా రమణి, ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈనెల 31న శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరగనున్నట్లు ఏపీవో గంగు నాయుడు తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ నిధులు, ఖర్చు, అభివృద్ధి, గడిచిన వారం రోజులుగా మండల వ్యాప్తంగా ఎస్ఆర్పి రాజు ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల నివేదిక ప్రజావేదికలో తెలియ జేయనున్నట్లు తెలిపారు.

హెటిరో పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలి

-బాణాలు ఎక్కిపెట్టి మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ కి రెండో అతి పెద్ద పైపులైను వేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. పైపులైన్కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన ధర్నా 482వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైన్కు వ్యతిరేకంగా బాణాలు ఎక్కుపెట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పైపులైన్కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బ తీస్తున్న హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీపై మత్స్యకారులు ధర్మ పోరాటం చేస్తున్నారని, ఈ పోరాటంలో న్యాయం ఉందని అంతిమంగా ధర్మం, న్యాయం గెలిచి తీరుతుందన్నారు. మత్స్యకారులు 482 రోజుల నుండి పోరాటం చేస్తుంటే ఇదేమీ పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైపులను వేసుకోవడానికి అనుమతులు ఇచ్చారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మత్స్యకారులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పర్యావరణ చట్టాలను యదేచ్ఛగా ఉల్లంఘిస్తున్న హెటిరో డ్రగ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా మత్స్యకారుల జీవనోపాధికి తీవ్రంగా నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైపు లైన్ వేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, చేపల సోమేష్, పిక్కి రమణ, బొంది నూకరాజు, మైలపల్లి శివాజీ, మైలపల్లి బాపూజీ, పిక్కి రాజు, మైలపల్లి వెంకటేష్, పిక్కి కాశీరావు, చోడిపల్లి రాజు పాల్గొన్నారు.



బాణాలు ఎక్కిపెట్టి నిరసన తెలుపుతున్న అప్పలరాజు ,మత్స్యకారులు


ఒరిగిపోయిన అరటి పంట

వర్షాలతో అరటి రైతు కుదేలు

ప్రజాశక్తి-గొలుగొండ: బుధవారం సాయంత్రం భారీ గాలులు వడగళ్లతో కురిసిన వర్షానికి అరటి రైతులు కుదేలయ్యారు. మండలంలో పాకలపాడు గ్రామ మాజీ సర్పంచ్ కామిరెడ్డి రామన్న అనే రైతు సుమారు 10 ఎకరాల్లో అరటి తోటను, పామాయిల్ తోటను పెంచుతున్నారు. గెలలు వచ్చే సమయానికి అకాల వర్షంతో అరటి తోట, పామాయిల్ తోట నేలకు ఒరిగిపోయింది. దీంతో లక్షల్లో నష్టం ఏర్పడిందని రామన్న వాపోయాడు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి పంటకు నష్టపరిహారం వచ్చే విధంగా చేయాలని కోరాడు.


ఆవేదన చెందుతున్న రైతు


మాట్లాడుతున్న జెడ్పిటిసి

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- జెడ్పిటిసి గిరిబాబు

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో చదవాలని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు సూచించారు. గురువారం మండలంలోని చీడిగుమ్మల జడ్పీ హైస్కూల్ ఫేర్వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ మానవ జీవితంలో 14 నుంచి 20 ఏళ్ల వయసు చాలా కీలకమైనదన్నారు. ఎవరైతే ఈ దశలో మనసును అదుపులో ఉంచుకొని ఆలోచనలను మంచి మార్గం వైపు నడిపించుకుంటారో వారికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ వయసులోనే పిల్లల ప్రవర్తనను జాగ్రత్తగా గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్య, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం పట్ల సిఎం జగన్ చిత్తశుద్ధిని కనబరుస్తున్నారని కొనియాడారు. నాడు నేడుతో మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరిగే విధంగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివిఎస్.నాగేంద్ర, సర్పంచ్ కాపారపు చినబాబు, ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, విద్యా కమిటీ చైర్మన్ చింతల అప్పలనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుకు వడ్డీ రాయితీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలో మార్చి నెల ఆర్థిక సంవత్సరం ముగింపు దృష్ట్యా ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. 17 సచివాలయాల్లో ఉన్న ముగ్గురు అడ్మిన్ ఉద్యోగులతో పాటు ఇతర విభాగాల ఉద్యోగులను ఆస్తి పన్ను వసూళ్ల కోసం విధులు కేటాయిస్తున్నారు. మార్చి 31 తేదీ లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి పన్నులు చెల్లించని బకాయిదారుల ఇళ్లకు మున్సిపల్ సిబ్బంది నోటీసులు అంటిస్తున్నారు. నాలుగేళ్లకు పైగా పన్ను చెల్లించని 25 మంది ఆస్తులు జప్తు వేస్తామంటూ ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 31 లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కనకారావు మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని ఉప యోగించుకోవాలన్నారు.

బాలిక మృతదేహం కలకలం

ప్రజాశక్తి-గొలుగొండ: రెండు రోజుల నుంచి కనిపించక పోయిన మైనర్ బాలిక బొడ్డేరు గెడ్డలో శవమై కనిపించింది. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డి.కొత్తూరు గ్రామానికి చెందిన తురె చిన్నారి(14) అనకాపల్లి జిల్లా రోలుగుంట గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల వసతి గృహంలో 9వ తరగతి చదువుతుంది. ఈ నెల 27న చిన్నారి డి.కొత్తూరు సమీపంలో ఉన్న గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో జరుగుతున్న తీర్థ మహోత్సవానికి స్వగ్రామమైన కొత్తూరుకు వచ్చింది.

మంగళవారం ఉదయం పాఠశాలకు వెళతానని చెప్పి బయలుదేరిన చిన్నారి శవమై కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. డి.కొత్తూరు గ్రామం నుండి గొలుగొండ మండలం చోద్యం చేరుకోవాలంటే మూడు కిలో మీటర్లు దూరం. ఈ మార్గమధ్యలో ఉన్న బొడ్డేరు గెడ్డలో చనిపోవడంపై అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు గురువారం మృతదేహం గుర్తించి కేడిపేట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో, నర్సీపట్నం రూరల్ సిఐ రమణయ్య, ఇన్చార్జ్ ఎస్సై నారాయణరావు సంఘటన స్థలంకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులు తమ కుమార్తె చిన్నారిగా గుర్తించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పదంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


మద్యం దుకాణం వద్ద వేచివున్న మందుబాబులు

రద్దీగా మద్యం దుకాణం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని మద్యం దుకాణం నిత్యం రద్దీగానే దర్శనమిస్తుంది. ఇందుకు ప్రధాన కారణం సిబ్బంది కొరత కాగా మండల కేంద్రంలో మద్యం దుకాణం పరిధిలో దాదాపు 14 గ్రామాల మందుబాబులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసుకుంటారు. గతంలో మద్యం దుకాణంలో నలుగురు సిబ్బంది ఉండే వారని, ప్రస్తుతం ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉండడంతో నిత్యం రద్దీగా దర్శనమిస్తుంది. మద్యం దుకాణంలో పనిచేసే వ్యక్తులు ప్రస్తుతం పనిచేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో సిబ్బంది కొరత ఏర్పడింది.

ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం గొలుసు దుకాణాలు కొనసాగుతున్నాయి. గతంలో పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలను నియంత్రించేవారు. ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో గొలుసు దుకాణాల సంఖ్య అధికంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో మద్యం అమ్ముకునేందుకు వేలంపాటలు సైతం నిర్వహించి నట్లు సమాచారం. మరి కొన్ని గ్రామాల్లో పండుగ చందా కోసం గ్రామాల్లో మద్యం అమ్ముకునే వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు.

1న 'స్వర రాగ గంగా ప్రవాహమే'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ : హైదరాబాద్కు చెందిన శ్రీకృష్ణ స్వర రాగ స్రవంతి ఆధ్వర్యాన ఏప్రిల్ 1వ తేదీన స్వర రాగ గంగా ప్రవాహమే.. శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎస్.ఫణిస్వామి తెలిపారు. కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్ను గురువారం లాసన్స్ బే కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫణిస్వామి మాట్లాడుతూ, 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకా నగర్లోని పౌర గ్రంథాలయంలో జరగనున్న సంగీత విభావరిలో హైదరాబాద్కు చెందిన గాయకులు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత వైఎస్.రామకృష్ణతో పాటు వై.సుధాకర్, శివరామకృష్ణ, ఎన్.రామనర్సింహం, ఉమా రాంగోపాల్, సాయి మేఘన, తుషార నిలయ, వీణ తదితరులు పలు గీతాలు ఆలపించ నున్నారని చెప్పారు. కార్యక్రమంలో రస రాగ మాధురి సంస్థ అధ్యక్షులు ఎమ్మెస్ మాధవ్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపి ఎంవిపి

సికింద్రాబాద్ -అగర్తల మధ్య ప్రత్యేక రైలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, సికింద్రాబాద్ – అగర్తల మధ్య వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. రైలు నంబర్ 07018 సికింద్రాబాద్ – అగర్తల ప్రత్యేక రైలు ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం సికింద్రాబాద్లో ఉదయం 11 గంటలకు బయలుదేరి మంగళవారం రాత్రి 23.15 గంటలకు అగర్తల చేరుకుంటుంది. ఈ రైలు పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బర్హన్పూర్, బాలాసోర్, మాల్దా టౌన్, కిషన్గంజ్, న్యూ జల్పైగురి, జల్పైగురి రోడ్, న్యూ కూచ్ బెహార్, న్యూ అలీపూర్దువార్, న్యూ బొంగైగావ్, గోల్పారా, గౌహతి, జాగి రోడ్, హోజాయ్, లుమ్డింగ్, న్యూ హఫ్లాంగ్, బదర్పూర్, న్యూ కరీంగంజ్, ధర్మనగర్ మీదుగా ప్రయాణిస్తుంది.

నేడు, రేపు మంత్రి మేరుగు నాగార్జున పర్యటన

ప్రజాశక్తి-విశాఖపట్నం : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున శుక్ర, శనివారాల్లో విశాఖలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం సర్క్యూట్ హౌస్కు ఆయన చేరుకుంటారు. అక్కడి నంచి అనకాపల్లి జిల్లా యలమంచిలి సమీపంలోని కొక్కిరాయిపల్లికి వెళ్లి ఎస్సీ గురుకుల పాఠశాలను సందర్శిస్తారు. ఆ తర్వాత నక్కపల్లికి చేరుకొని ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిశీలిస్తారు. నక్కపల్లిలో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలను కూడా తనిఖీ చేస్తారు. రాత్రికి దసపల్లా హోటల్కు చేరుకొని బసచేస్తారు. 1వ తేదీ ఉదయం ఆనందపురంలో ఉన్న పౌల్ట్రీ కాంప్లెక్స్ను పరిశీలిస్తారు. అనంతరం దేవరాపల్లికి చేరుకొని ఎస్సీ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తారు. దేవరాపల్లి నుంచి కొత్తవలస వెళ్లి ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ను తనిఖీ చేస్తారు. శ్రీకృష్ణాపురంలో ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిశీలిస్తారు.